# ఒక వలపు విరిసింది

మీ కంగారు మీదేగాని మా సంగతి పట్టించుకోరుసార్!

నేను మూడవ స్టేషన్‌లో పలకరించబోయేసరికి విసుక్కున్నట్టు నటించాడు ట్రీటయిర్ కండక్టర్.

నేనింక అతని చేత ప్రయివేటు క్లాసులు పెట్టించుకోదలచుకోలేదు.

వెనిక్కి తిరిగి వస్తుంటే, అతనే కాస్త తగ్గినట్టున్నాడు వెనక్కి పిలిచాడు. ''ఇంటర్వ్యూకా ?... ఈ రోజుల్లో రిజర్వేషన్ లేకుండా రాత్రి ప్రయాణం....'' అతను ఇంకా ఏదో చెప్పబోతూ ఉంటే నా టిక్కెట్టూ ఒక ఇరవై కాగితం అతని చేతిలో పెట్టాను.

''ఫార్టీనైన్ తీసుకోండి! పక్కనే ఫామిలీ, కాస్త కాలక్షేపంగా ఉంటుంది.''

నేనెక్కడ చిల్లర అడుగుతానేమోనని ముందర కాళ్లకు బంధంలా నా మీద అపేక్ష ఒలకపోసే మాటలకి చిరునవ్వొకటి జోడించాడు. నేను నా బెర్త్ వెదుక్కుని వెళ్ళి కింద సీట్లో కూలబడి సిగరెట్ వెలిగించాను.

–''మళ్లీ ఎప్పుడొస్తారు ?''

''వెళ్లకుండానే ఎలా చెప్పను ?'' ఛెళ్ళుమని చెంపకాయ కొట్టినట్టు చెప్పాను.

అలమేలు తలదించుకొని వెళ్లిపోయింది. అదొక థ్రిల్.

మరోగంట తరువాత సూట్‌కేస్‌లో బట్టలు సర్దుతూ ''రెండు జతలు వేశా... గాలి తలగడా, దుప్పటి, రెండు లుంగీలు... తువ్వాలు.. ఎక్కడయినా మరచిపోతారో ఏమో...''

''తోడు పెట్టుకుని వెళ్లిన వాళ్లనిబట్టి ఉంటుందే మరచిపోవడం వెర్రిమోహమా నీతో వెళితే మరుపు ప్రశ్నలేనేలేదు.''

అనుకున్నా మనసులో.

–టెన్త్ చదువుకున్న అలమేలు జడలాగి బిగుతుగా వేసుకుని, మునుకుల్లో బుర్ర దించుకొని కూచుని పెళ్లిచూపుల్లో కళ్లు కలిపే ప్రయత్నం చెయ్యకుండానే నాచేత తాళి కట్టించుకోవడానికి సిద్ధపడిపోయింది ''మాకు రఘు ఒక్కడే! మా మాటకి ఎదురాడవలసినవాడుకాదు, మా కుటుంబ సంప్రదాయం అల్లాంటిదీ, ఇల్లాంటిదీ కాదు. వీలువెంట మీరు మాయింటి కొస్తే మిగిలిన విషయాలు మాటాడుకుందాం!''

నాన్నగారు వెంటనే చెప్పేసారు.

మాధవి గురించి అమ్మకి తెలుసుననుకున్నా. నేను మాధవిని గురించి చెప్పకుండానే ఆ సాయంత్రమే 'వాళ్లు' మా యింటికొచ్చి నాన్నగారికి నచ్చిన మేరకు ఒప్పందం చేసుకున్నారు.

నా పెళ్లయిన మరో అర్నెల్లకి మాధవి పెళ్లి అయింది. తనే స్వయంగా తన పెళ్లి కార్డు ఇచ్చింది మాధవి. ఒక్క తృటికాలం నా గుండె లయ తప్పింది.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చటుక్కున నా కళ్లు తుడిచి నా చేతిని నొక్కి లోపలకు వెళ్లిపోయింది. పెళ్లయిపోయింది.

మాధవి దగ్గర నుంచి ఉత్తరం కోసం చూశాను. నా ఆశలు చివుళ్లు తొడుగుతూనే ఉన్నాయి.

నా బ్రతుకులోంచి మాధవిని వెళ్లనివ్వను. మాధవిని చూడడానికి అవకాశం వచ్చింది.

హైదరాబాదులో వాళ్లాయన ఆఫీసు నాకు తెలుసు. ఇల్లు తెలుసుకోడమూ కష్టం కాదు.

ఏకాంతంగా ఒక్కక్షణం దొరికితే చాలు... నా చేతిలో కాలుతున్న సిగరెట్టు మొన చురుక్కుమని వేళ్లకంటుకుంది... నేలరాసి నేను లేచి నుంచోబోయాను. బండి వేగానికి ముందుకు తూలాను.

''అబ్బ! ఉండవే.. పాలుకలపాలికదా'' ఎదురు బెర్త్‌లో ఓ ఆవిడ లేవగానే ఏడుపు లంకించుకున్న బిడ్డతో అంటోంది. గొంతు ఎక్కడో ఇన్నట్టుంది. లేచి కొక్కానికి వేలాడదీసిన ఫ్లాస్క్ అందుకుంది ఆవిడ. పాప కక్కటిల్లిపోతున్నట్టు ఏడుస్తోంది.

ఆవిడ ఫ్లాస్క్ పుచ్చుకుని తిరిగి వస్తుంటే నేను తల ఎత్తి చూశాను.

మాధవి !

''మా...'' పిలవబోయాను. ఏకాక్షరం పాప ఏడుపులో బయటకు వినపడలేదు. ఎదురుగా నుంచున్నా మాధవి నన్ను గుర్తించే అవకాశం ఉన్నట్టు లేదు.

'' ఏమండీ ! ఏమండీ ! డబ్బా మూత రావడంలేదు. తీసిపెట్టండీ'' ఆమె భర్తని లేపింది. అతను చటుక్కున దిగి పావలా కాసుతో డబ్బా మూత తీసి పాలు కలపడంలో భార్యకి సహాయం చేస్తున్నాడు.

పాప నోటికి పాలసీసా పీక అందడంతో సద్దు మణిగింది.

రైలు రొదవినపడుతోంది.

ఆమె పక్కనే ఆయన కూర్చున్నాడు.

పాప రెండు చేతులతోనూ సీసా పట్టుకుని పాలు తాగుతోంది.

''అబ్బ ! గొప్ప పెంకిది బాబూ ! డబ్బా మూత తీసేవరకూ ఆగదే - పని తోచకుండా గోల... ఆ అబ్బ పోలికే'' పాప వంకే చూస్తూ అంటున్న భార్య వంక గోముగా చూస్తున్నాడతను. కడుపు తీపి అంటే అదేనేమో !

నా కళ్లు గమనించడం చూశాడేమో ! ''హలో ! మీరు ఎక్కడ ఎక్కారు ?''

నేనప్పుడు మాధవి కళ్లలోకి చూస్తున్నాను ''సామర్లకోటలో''

''నాకు నిద్రముంచుకు వచ్చేసింది. రైలు చూస్తే నిద్రే'' ! నేను మాధవి పలకరింత కోసం ఎదురుచూసున్నా.

''మీరు హైదరాబాదేనా ?''

'' అఁ !''

మాధవి పలకరించలేదు. పాప కళ్ల లోకి చూస్తోంది. పాప తదేకంగా తల్లిని పరీక్ష చేస్తోది.

'' ఎక్కడుంటారు హైదరాబాదులో !''

'' ఊరికే చుట్టపు చూపుకేలెండి - మీరు !''

''బాలానగర్ !''

మాధవి ఇంకా పాపవంకే చూస్తోంది. అతి భయంకరమైన సన్నివేశాన్ని ఎదుర్కోవడమెలా ! భయం కేవలం మనసులో ఉంటుంది. సన్నివేశంలో కాదు. ''చూశారా ? ఆ పాలు తాగడం అయిపోయిందిగా ! సీసా ఎలా పడేసిందో ?...'' మాధవికి లోకంలో రెండే రెండు జీవులతో సంబంధం ఉన్నట్టు అతగాడి కళ్లలోకి చూస్తూ అంది.

అతను నవ్వేశాడు..

''రైలు సరిగ్గా టైమ్‌కు వెళుతున్నట్టుంది.''

అతను ఎవరితో అన్నాడో నాకు తెలియలేదు.

''గుడ్ లక్! మనం అనుకోనివి జరుగుతూ ఉంటాయి.''

నేను వేదాంతిలా గొణుక్కున్నాను.

మాధవి నా గొంతు వింది. నన్ను చూడనూ చూసింది. చూడడం చాలా సేపు చూసింది. అయినా కళ్ళలో నాకు తెలిసిన మాధవి కళ్ళవెలుగు లేదు.

మరేదో కాంతి. ఆ కాంతిలో ఆమెకు కనపడేది ఇద్దరే... తన భర్త, తన పాప.... ఎదురుగా ఎవరూ ఉన్నట్లు పట్టించుకోవడం లేదు.

మాధవి నన్ను మరిచిపోయిందా ?

నటిస్తోందా ?

''నేవెళ్లి పడుకుంటా... ఇక అది నిద్ర పోదు...'' పాపని అతగాడికి అందించి ఆమె మీద బెర్త్ మీదకు వెళ్ళిపోయింది. మరి నా వంక చూడనేలేదు.

కాసేపయ్యాక నేనూ మీదకెళ్ళి నా బెర్తు మీద పడుకున్నాను.

మాధవి ప్రశాంతంగా, నిశ్చలంగా నిద్రపోయింది.

నా మనసు వెయ్యి ముక్కలైపోయింది. మాధవి...నేనూ... మాధవి.. ఎన్నిసార్లు! మరచిపోవడం సాధ్యమా ?

ఇదంతా నటనే ?

తర్కంతో నా తల పగిలిపోతోంది.

నటన అయితే నా వంక చూడకుండా ఉండగలదా ? అంత ప్రశాంతంగా నిద్ర పోగలదా ? నిద్ర లేకపోతే కదలకుండా ఉండగలదా ?

నా మనసు వెయ్యిముక్కలైపోయింది. నేను అటూ, ఇటూ ఒత్తిగిల్లుతూనే ఉన్నాను.

మనసులో ఓ మెరుపు... ఓ కుదుపు.. మాధవి ప్రవర్తన నటనో నిజమో తెలుసుకోవాలనుకోవడం తార్కికతేమో కాని ఆమె ప్రవర్తన సహజం కదూ !

మా జీవిత గమ్యాలు వేరయ్యాయి. మరచిపోవడం వల్ల మేలు ఉంది. అందులో నీతి ఉంది. అందులోనే జీవిత రహస్యమూ ఉంది.

తను పెళ్ళి చేసుకున్న మనిషీ. తను జన్మనిచ్చిన పాపావాళ్ల చుట్టూనే మాధవి జీవితం అల్లుకుపోయింది.

వాళ్ళ మీదనే ఆమె మనసు కేంద్రీకృతమైంది మిగిలినవి అప్రస్తుతాలు. అనవసరాలు.

పరపురుషుడితో తనకేం పని ?

నాకో జీవిత సత్యం కళ్లముందు సాక్షాత్కరించింది.

నేను అలమేలుకి అన్యాయం చేస్తున్నాను. పాపాన్ని, అది పాపమే అయితే, మాధవి నాతో పంచుకుంది. కాని ఇప్పుడు పాపానికి అతీతంగా ఎదిగిపోయింది. పాపాన్ని మరిచిపోయింది. అంటిన బురద కడిగేసుకోగలిగింది.

మరి నేనో ?

అగ్నిసాక్షిగా పెళ్ళాడి, వేదోక్తంగా ఏడడుగులూ నడిచిన వ్యక్తి గుండెని కారణం లేకుండా గాయం చేస్తూ... నాది అనేది ఏది ?

నన్ను ఎదురుగా చూసినా చలించని మాధవా ? ఆమె మీద నేను వెర్రిగా, మూర్ఖంగా, అనాగరికంగా, పెంచుకున్న ఆశా ?

నాకు సర్వస్వమూ అర్పణ చేసిన అలమేలా ?

–నాకు రైలు ఆపి దిగిపోవాలనిపించింది.

''అలమేలు... అలమేలూ... ఐయామ్ సారీ అలమేలూ !'' అలమేలుని గుండెల్లోకి తీసుకోవాలనిపించింది.

నా గతం తెలియని అలమేలు నన్ను పుణ్యమూర్తిగానే భావిస్తోంది.

మాధవి గతం తెలిసిన నేను మాధవిని పుణ్యమూర్తిగా భావిస్తున్నాను.

అలమేలు అవగాహనలో ఆత్మీయత ఉంది... మరినాలో... తార్కికతా ?

– ఏది ఏమైనా మాధవి పుణ్యమూర్తే ! తెలిసి చేసినా తన తప్పిదాన్ని మనసులో మాలిన్యం లేకపోవడం వల్ల చిరు వయసు ఉద్రేకపు పొంగుగా నెట్టేసింది. మరి నేనో ! మనసులో క్షమార్హం కాని మాలిన్యాన్ని పెంచుకుని ఆత్మీయతను ఈసడించి పాపినయ్యాను. నా పాపాన్ని కడిగివెయ్యగలిగిన శక్తి మాధవికి భర్త ఎడల ఉన్న అనురాగాన్ని గ్రహించగలిగిన అవగాహనకే ఉంది. ఆమె మమతలో మచ్చలేదు. ఆమె నాకు కనువిప్పు కలిగించింది.

–నాకు తెలివి వచ్చేసరికి రైలు సికిందరాబాదు స్టేషన్‌లో ఉంది....

రాత్రి నేను మాధవిని చూడడం కలా ? నిజమా ?

ఆ ప్రశ్నకి సమాధానం ఇదే... ''మాధవి పుణ్యమూర్తి !''

**జ్యోతి**

జులై, 1984